1089

# అతకని అంతర్యాలు

ఇందిర వస్తూవుండటం చూసి, చంద్రశేఖరం తృప్తిగా శ్వాస విడిచాడు. అంతలో యేర్పడిన విసుగూ, కోపం, పటాపంచ లయ్యాయి. హృదయం తేలికపడింది. ఆమెకు అభిముఖంగా నడిచాడు.

ఇందిర చంద్రశేఖరంని సమీపించి, చిలిపిగా నవ్వింది. ఆ నవ్వులో అందంవుంది. ఆకర్షణవుంది. అంతకు మించిన అహంభావంకూడా వుండేమోననిపిస్తుంది ఆ నవ్వేతీరు చూస్తే. "నీ కోసం యెంతసేపట్నుంచి యెదురు చూస్తున్నానో తెలుసా ఇందిరా? నిజానికి మూడు రోజుల్నించి నీతో మాట్లాడాలనీ, నా మనసులో భావాల్ని వ్యక్తం చెయ్యాలనీ అనుకుంటున్నాను. కాని, రోజూ నీ వెంట యెవరో ఒక స్నేహితురాలు వుంటూనే వుంది. ఇక యెలా మాట్లాడను? అందుకే, యీ వేళ విసిగిపోయి, మొండికెత్తి యెవరువున్నా ధైర్యంగా మాట్లాడేయా లనుకున్నాను." అన్నాడు చంద్రశేఖరం ఆమెప్రక్కనే నడుస్తూ.

ఇందిర చిన్నగా నవ్వింది. ఆ నవ్వు, మల్లెలువిరబూసినంత అందంగా, తెల్లగా వుంది. "నీలో సహనం చాలా తక్కువని, తెలుసు చంద్రం! అందుకే, యీరోజు ఒంటరిగా వచ్చాను. ఏఁవిటి మాట్లాడా లనుకున్నావో, వేగిరం చెప్పు. . ."

"అంత తొందరయితే యెట్లా ఇందిరా; అలా కాస్సేపు ఆ కాలువగట్టున కూచుని మాట్లాడుకుందాం రాకూడదూ ?"

"నా కిప్పుడు తీరిక లేదు చంద్రం! అయినా, చీకటి పడుతోంది. వేగిరం వెళ్ళకపోతే, మా నాన్నగారు కోపగించుకుంటారు. నువ్వు మాట్లాడదల్చుకున్న దేమిటో, రెండు ముక్కల్లో టూకీగా చెప్పకూడదా యేమిటి?"

"అదేమంత సాధారణ విషయం కాదు క్లుప్తంగా చెప్పడానికి."

"ఏం_అంతసాధారణ విషయమా? సరే...ఆ తర్వాత యెప్పుడో వీలుంటే చెబుదువుగాన్లె..."

"ఎప్పుడో చెప్పవల్సిన విషయం కూడా కాదు ఇందిరా ... ఏమిటంటే...మరే ... మరి మన వివాహం ..." అని కాస్త బిడియపడుతూ యేదో చెప్పబోతున్న చంద్రశేఖరం ప్రయత్నానికి అడ్డువచ్చింది.

"ఓస్! ఇదేనా పెద్ద అసాధారణ విషయమన్నావు. అయినా, నాకు తెలీక అడుగుతాను — నీ ధ్యాసంతా యెప్పుడూ వివాహంమీదే కేంద్రీకృతమై వుంటుందేమిటి? నిజంగా నాకు నవ్వు వస్తుంది సుమా! జీవితంలో వివాహం తప్పించి, మరో సమస్య లేనట్లుగా భావిస్తున్నావా యేమిటి కొంపదీసి ... ఔన్లే, కార్ఖానాలో పనిచేస్తున్న వాడివి ... అంతకంటే నీకు మరో దృక్పథం యెల్లావుంటుంది? సరేలే—

అవన్నీ యిప్పుడెందుకుగాని, ప్రస్తుతానికి ఆ విషయాన్ని విస్మరించి వూరుకో! ముందు, నా కాలేజీ చదువు పూర్తి కానీయ్... ఆ తర్వాత వివాహ విషయం ఆలోచిద్దాం తీరిగ్గా...వస్తా..." అంటూ అదోలా మూతి చిట్లించుకుని ముందుకు సాగిపోయింది.

చంద్రశేఖరం మొహం చిన్నబోయింది. అతనికి అదో గొప్ప అవమానంగా తోచింది. చరచరా వెళ్ళి పోతున్న ఇందిర కేసి, అసహ్యంతో, ద్వేషంతో చూశాడు. గట్టిగ శ్వాసవిడిచాడు. ఎంత అహంభావం! ఎంత నిర్లక్ష్యం! ఇపుడిలా మారిందేమిటి? అయినా, యేఁవిటా వెటకారం! కార్ఖానాలో పనిచెయ్యడం హీనమైనదనే గామోసు ఆమె అభిమతం! సరే ఆమె భావాన్ని ఆమె దగ్గరే పదిలపరిస్తే సరి! ఇంతటి మహా 'ఊర్వశి దొరక్క పోతుంది మరి...' కసిగా అనుకుంటూ యింటిముఖం పట్టాడు.

చంద్రశేఖరంకి ఇందిరపట్ల వుండే అనురాగమంతా ద్వేషంగా మారింది. కసిగా మారింది. ఆమె నిర్లక్ష్యానికి యెప్పుడో ఒకప్పుడు తగినజవాబు యివ్వొచ్చు ననుకున్నాడు.

* * *

చంద్రశేఖరం చదువుకున్నవాడే! మంచి మార్కు లతో స్కూలుఫైనల్ పాసయ్యాడు. అయితేనేం—అప్పట్లో అతని అదృష్టం బాగు లేక, కార్ఖానాలో అప్రెంటిస్‌గా చేరాల్సి వచ్చింది. ఒక విధంగా చూస్తే యే గుమాస్తాగానో

చేరేకంటె యిందులోనే మంచి భవిష్యత్తు వుందని భావించాడు. అందుకే తను చేస్తున్న పనిని చెడ్డగా భావించలేదెప్పుడూ.

ఇందిర, చంద్రశేఖరం స్నేహితుని చెల్లెలు. ఇందిరతో అతని పరిచయం క్రమంగా ప్రగాఢ మయ్యింది. అయితే, ఆమె కాలేజీలో చేరినతర్వాత చంద్రశేఖరంతో అంతచనువుగా మాట్లాడ్డం లేదు. ఏదో తప్పించుకుని తిరగాలనే చూస్తుంది. ఆమె యెందుకలా పరివర్తన చెందిందో, యింతవరకూ అర్థం చేసుకోలేని చంద్రశేఖరంకి యిప్పుడు అవగాహన అయ్యింది. ఇందిర తన అంతస్థుని చిన్నచూపు చూస్తోందని గ్రహించడానికి, అతనికి యెక్కువ సమయం పట్టలేదు.

ఇందిర తన భవిష్యత్తు గురించి ప్రస్తుతం యెన్నో కలలు కంటోంది; తను డిగ్రీ పుచ్చుకొని, మంచి హోదాలోవున్న వ్యక్తిని వివాహం చేసుకొని, భోగ భాగ్యాలతో జీవిత మాధుర్యాన్ని చవిచూడాలన్న ప్రగాఢ వాంఛ ఆమెలో పేరుకుపోయింది. ఆ వాంఛ తన అంతస్తుకి తగినదా, కాదా, అన్న విషయాన్ని ఆమె స్మరించనే లేదు. ఆశల్ని పెంచుకోవడానికి సుంకమేమీ లేదుగా మరి! ఆ వాంఛ ఆమెలో మొలకెత్తిన రోజునుండీ, ఆమె దృష్టిలో జారిపోయాడు చంద్రశేఖరం.

అదృష్టం కొందర్ని వెదుక్కుని వస్తుంది. ఆ రావడం, యెప్పుడు వస్తుందో, మెరుపులా వస్తుంది. అది యెవ్వరూ

చెప్పలేరు. అటువంటి అదృష్ట జాతకుళ్ళలో ఒకడని చెప్ప వచ్చు చంద్రశేఖరంని.

చంద్రశేఖరంకి, ప్రస్తుతం తను వెలిగిస్తున్న అప్రెంటిస్‌గిరీ పట్ల ఒక విధమైన విరక్తి, యేహ్యాభావం జనించాయి. తన ప్రేమ ఫలించకుండా వుండడానికి కారణం ఆ వుద్యోగమే నన్న నిర్ధారణకి వచ్చేశాడు. అందుకే, చెప్పలేనంత యేహ్యాభావం పుట్టింది. అతని దృష్టి, వ్యాపారం కేసి మళ్లింది. ఈ అభిప్రాయం కలగడమేవిటి, మద్రాసులో వుంటున్న స్నేహితుడు గుర్తుకొచ్చాడు. ఆ మధ్య రెండుమూడు సార్లు అతను వుత్తరం రాశాడు కూడాను, వచ్చేయమని; ఆ నిర్ణయానికి రావడమే తడవుగా, వుద్యోగానికి రాజీనామా యిచ్చేశాడు. జాప్యం చెయ్యకుండా మద్రాసు చేరుకున్నాడు.

చంద్రశేఖరం, వుద్యోగానికి రాజీనామా యిచ్చేసి, మద్రాసు వెళ్లిపోయినట్టు, ఇందిర వింది, కాని, అంతగా బాధపడలేదు. అతని భవిష్యత్తు గురించి, ఆమెకి పెద్ద వూహలేమీ లేవు. చాలా నిర్లక్ష్యంగా నవ్వుకుంది.

* * *

చంద్రశేఖరం ప్రస్తుతం మద్రాసు నివాసి. స్నేహితుడికి వ్యాపారంలో సహకరిస్తూ, నమ్మకగా మెలుగుతూ వస్తున్నాడు, ఆ సంవత్సరం వ్యాపారంలో అపారమైన లాభాలు వచ్చాయి. అందుకు కారణాలు యేవైనా, చంద్రశేఖరం మీద మాత్రం స్నేహితుడికి మరింత గురి కుదిరింది.

"చంద్రం, యీ సంవత్సరం మన వ్యాపారం యెలా సాగిందో నీకు తెలుసా ?" ఓ రోజు అన్నాడు స్నేహితుడు సుబ్బారావు.

"బాగానే సాగిందనుకుంటాను." ముక్తసరిగా జవాబిచ్చాడు చంద్రశేఖరం.

"అంత నీరసంగా అంటున్నావేమిటి ? వుత్సాహంగా అను. మంచి లాభాలొచ్చాయి. నువ్వు నాకు కుడిభుజంగా వుండటమే ఇందుకు కారణమేమో ! అందుకే, యీ రోజు నుండి యేం చేస్తున్నానో తెలుసా ? నిన్ను మేనేజరుగ నియమిస్తున్నాను, జీతం మరో వంద పెంచుతున్నాను. అలాగని, కేవలం నిన్ను నా వద్ద పనిచేసే ఒక వుద్యోగిగా మాత్రమే గుర్తిస్తున్నానని అపోహ పడకు..."

చంద్రశేఖరం మురిసిపోయాడు. ఆనందం పట్టలేని ఆశ్చర్యంతో అతని మొహం తెల్లనయింది.

"ఏమిట్రా సుబ్బారావ్ నువ్వంటున్నది ?" వింతగా స్నేహితుడి కళ్లల్లోకి చూస్తూ అన్నాడు.

ఒక్కొక్కప్పుడు నిజం కూడా నమ్మలేని పరిస్థితులు యేర్పడుతూ వుంటాయి. ఒక్కసారి నూరు రూపాయలు జీతం పెంచడమంటే, మేనేజరుగా ప్రమోషను రావడమంటే, చంద్రశేఖరంకి ఆశ్చర్యంగా వుండదూ మరి. సుబ్బారావు పరిహాసమాడుతున్నాడేమోనన్న అనుమానం కూడా కలిగిందంటే, వింతలేదు. అందుకే, అంత వింతగా ప్రశ్న వేశాడు.

సుబ్బారావు చిన్నగా మందహాసం చేశాడు. "పరిహాస మనుకోకురా చంద్రం; నిజం చెప్తున్నాను. నీ కోసం ఒక స్కూటర్ కి కూడా ఆర్డరిచ్చాను. నా సంస్థకి నువ్వు మేనేజరువి— ఆ అంతస్తు మెయిన్ టెయిన్ చెయ్యొద్దూ మరి?" నవ్వుతూ అన్నాడు.

చంద్రశేఖరంకి నోట మాట రాలేదు. అమితానందంతో వుక్కిరిబిక్కిరి అయ్యాడు. అనుకోకుండా అతనికి తన అప్రెంటిస్ వుద్యోగం గుర్తుకొచ్చింది. నవ్వుకున్నాడు. వున్న పళంగా స్నేహితుణ్ణి కౌగలించుకున్నాడు.

"నీ అభిమానాదరాల్ని యీ జన్మలో మర్చిపోలేనురా సుబ్బారావ్...నీ ఋణం యెలా తీర్చుకోవడమో...!"

"చాల్లేరా...యింక దండకం ప్రారంభించకు..." మందలించాడు నవ్వుతూ, పొగడ్తలు యిష్టంలేని సుబ్బారావు.

* * *

చంద్రశేఖరం, యిప్పుడు మునుపటి చంద్రశేఖరం కాదు. అతని జీవితపథమే మారిపోయింది. అతని జీవితానికి ఒక విలువ, అంతస్తు వచ్చాయి. ఇప్పుడతనికి ఇందిర గుర్తుకు రావడమే లేదు. అతని పరిచయం కోసం తహతహలాడే సుందరాంగులు, యెంతోమంది రోజూ తటస్థపడుతున్నారు. నిజానికి వారిముందు, ఇందిర ఏ విధంగానూ అధికురాలు కాదు. అటువంటి వాతావరణంలో ఇందిర యెట్లా గుర్తు కొస్తుంది?

మానవనైజం అతి విచిత్రమైంది. అతి చంచలమైనది. ఒక స్థిరమైన మార్గం దానికి లేదు. వూసరవెల్లిలా రంగులు మారుస్తూనే వుంటుంది.

చంద్రశేఖరంకి పట్టిన అదృష్టం తన అన్నయ్య ద్వారా వింది ఇందిర; అతని అంతస్తు నిజంగా ఆమెను ఆకర్షించిందనే చెప్పాలి. ఇంతకుపూర్వం అతనిపట్ల వుండే నిర్లక్ష్యం మంచు ముక్కలా కరిగిపోయింది. ఈ పరిణామానికి కారణం, చంద్రశేఖరం అంతస్తులో వచ్చిన మార్పే. ఆమె ప్రేమకి చైతన్యం వచ్చిందిప్పుడు. అతణ్ణి తనవాడిగా చేసుకోవాలనే వాంఛ పురివిప్పి నాట్యం చేసింది. ఇప్పుడు చంద్రశేఖరం ఆమె కళ్ళల్లో అనుక్షణం మెదుల్తూ వున్నాడన్నా ఆశ్చర్యం లేదు. తనంటే యెంతో అభిమానించే చంద్రశేఖరం; తనకోసం పరితపించే చంద్రశేఖరం; ఇప్పుడు తన వివాహానికి అంగీకారం తెలుపుతూ ఉత్తరం రాస్తే, యెంతగా మురిసిపోతాడో ? యీ భావన వచ్చేసరికి ఆమెలో సిగ్గు ముంచుకొచ్చింది. నవ్వొకుంది లోలోన. వెంటనే ఒక ఉత్తరం రాసింది. ఆ ఉత్తరంలో తన ప్రేమనంతా ఒలకబోసింది. తనకు తెలిసిన ప్రేమపదాల్ని క్రోడీకరించి రాసిందా లేఖ. తన వుత్తరం అందిన వెంటనే చదువుకుని, సంతోషంతో వుబ్బి, తబ్బిబ్బయిపోయి, వున్న పాటున వచ్చేస్తాడని భావించింది ఇందిర. ఆమెలో ఆ అహం భావం యింకా అడుగంటలేదు.

కాని, ఆమె ఊహించినట్టుగా జరగలేదు. చంద్రశేఖరం ఇందిర వుత్తరం చదువుకుని సంతోషంతో గంతులు

వెయ్యలేదు. నవ్వుకున్నాడు తేలిగ్గా. నిజానికి అతనికి ఇందిర అప్పుడే జ్ఞప్తికి వచ్చింది. చాలా రోజుల తర్వాత ఆమె అంత శ్రమ తీసుకుని రాసిన ఆ ప్రేమలేఖను, చాలా తేలిగ్గా చూశాడు. అతనికిప్పుడు అర్థమయ్యింది, ఆమె అంతర్యం యేమిటో! అయితే, తనకేనా అభిమానం లేనిది? తనకీ అంతర్యం అన్నది ఒకటి వుంది. తనకీ వ్యక్తిత్వం వుంది. తనేనా అంతస్తు కోరనివాడు? ప్రస్తుతం తన అంతస్తుకి, తన ఆహాతుకి తగ్గ భార్య లభించాలని తనూ కోరుకోవడంలో తప్పేముంది?... యీ విధంగా అతని ఊహాలు, పరిపరి విధాల సాగినయ్. అతనితో పరిచయమున్న పలువురు నవ నాగరిక యువతులు, అతని కళ్ళముందు మెదిలారు, వాళ్ళంతా, అందచందాల్లోనూ, ఆకర్షణలోనూ, చదువు సంస్కారాల్లోనూ, ఇందిరకంటె ఒక మెట్టు పైనున్నవారే. వారిలో యే ఒక్కరు తనకి భార్య అయినా కొంత సబబుగా వుందిగాని, ఇందిరలో తనకి భార్యగా వుండే లక్షణాలే లేవు. అయినా, యిన్ని ఆలోచించడం అనవసరం! ఆనాడు తన ప్రేమను తేలికగా పరిగణించి, తృణీకరించిన వ్యక్తి, యిప్పుడు తన అంతస్తు చూసి దగ్గరకు రావాలని ప్రయత్నిస్తోందంటే, ఆమెలో యెంత స్వార్థం వుంది! నిజమైన ప్రేమే వుంటే అలా ప్రవర్తించి వుండదు. ఛీ! అటువంటి వ్యక్తిని పెళ్ళిచేసుకోవడమా! అదెప్పటికీ జరగదు. అసలు ఆమెకి జవాబు రాయడంకూడా అనవసరమే!... అనుకున్నాడు చంద్రశేఖరం. ఆ క్షణంలో ఇందిరపట్ల అంత ద్వేషం యేర్పడిందన్న మాట. కాని,

అంతలోనే కాస్త జాలిపుట్టి, కనీసం తన నిరాకరణ తెలుపుతూ జవాబు రాయాలని నిర్ణయించుకున్నాడు. తన కసిని, ద్వేషాన్ని, అందులో వ్యక్తం చెయ్యాలనుకున్నాడు. వెంటనే ఉత్తరం వ్రాయడానికి వుపక్రమించాడు.

మైడియర్ ఇందిరా!

నీ ప్రేమలేఖ అందింది. నిన్ను యేనాడో మర్చిపోయాను. కాని, నీ యీవుత్తరం మళ్ళీ నిన్ను గుర్తుకు తెచ్చింది. ఇక్కడికి వచ్చాక, యీ వాతావరణంలో నువ్వు జ్ఞప్తి రాలేదంటే, ఆశ్చర్యమేమీ లేదు. ఇదో స్వర్గంలా వుంది. నిజమైన జీవితాన్ని, ఇక్కడే ప్రారంభించానేమో ననిపిస్తోంది. ఇన్నాళ్ళ తర్వాత నువ్వు నాపట్ల యెంతో అనురాగాన్నీ, ప్రేమనూ, వ్యక్తంచేస్తున్నావు. అందుకు నేనే ఆశ్చర్యపోతున్నాను. కాని, ఒక్క విషయం తెలుసుకోవాలని వుంది. నేను అక్కడ అప్రెంటిస్‌గా పనిచేస్తున్న రోజుల్లో, నీకోసం, నీ చల్లని చూపులకోసం తహతహలాడే ఆ రోజుల్లో నీ యీ ప్రేమానురాగాలు యేమయ్యాయి? నిన్ను నేను మనసారా ప్రేమిస్తున్నా, నువ్వు మాత్రం యేదో ఆధిక్యత చూపుతూ, నన్ను చులకన చేసేదానివి. ఏ ఆధిక్యత నీ చేత అలా చేయించిందో, నాకు అర్థంకాలేదు. కాని, కనిపించిన కారణం ఒక్కటే; నీ చదువు చూసే నీ ఆధిక్యతను పెంచుకొనివుంటావు, ఔనా? కాని ఇందిరా, 'ఆధిక్యత' అన్నది యే ఒక్కరిస్వంతం కాదు. ప్రతి వ్యక్తికీ 'ఆధిక్యత' యేదో ఒక విషయంలో

వుంటుంది. అది నువ్వు మర్చిపోయావు. ఇప్పుడు నా ఆధిక్యత వేరు. ఇప్పుడు ఆర్థికంగా నా అంతస్తు పెరిగింది. నాకు భార్య కాదగిన వ్యక్తి, నా అంతస్తుకి దగ్గర్లో వుండాలి కదా ? అటు వంటి అంతస్తు నీకు లేదని నాకు తెలుసు. నువ్వా కాదన లేవు. అప్పట్లో నువ్వు చూపించిన 'ఆధిక్యత' ఇప్పుడేం చేసుకుంటావు ? అంటే, నాకు భార్యకాగల అర్హత నీకులేదు. అందుకే, నీకు నిరాశ కలిగిస్తున్నందుకు మరేం బాధపడొద్దని, నిరాశతో కుమిలి పోవద్దని తెలియజెయ్యడానికే యీ ఉత్తరం రాస్తున్నాను. నన్ను వివాహం చేసుకోవాలన్న నీ వాంఛను రూపుమాపి, నన్ను మర్చిపో: ఇదే నేను కోరేది. అయితే, ఒక్క విషయంలో మాత్రం నిన్ను అభినందించక తప్పదు...

ఆనాడు, నువ్వే గనుక నన్ను చిన్నచూపు చూసి వుండకపోతే, నేనీ అంతస్తుకి వచ్చేవాణ్ణి కాదేమో ! అందుకు నా ధన్యవాదాలందుకో. మీ అన్నయ్యను అడిగినట్లుచెప్పు... నీ పెళ్ళికి ఆహ్వానం పంపుతావనుకుంటాను. వుంటాను మరి. తీరిక లేదు... లేకుంటే ఇంకా పెద్ద ఉత్తరమే రాసేవాణ్ణి. ప్రక్కనే టెలిఫోను మ్రోగుతోంది ... మాట్లాడాలి ... టా ! టా !!

నీ – చంద్రం...

చంద్రశేఖరం వుత్తరాన్ని మరోసారి చదువుకొని, తృప్తిగా నవ్వుకున్నాడు. ఈ ఉత్తరం తప్పకుండా ఇందిరను

గాయపరుస్తుందన్న నమ్మకం అతనికి యేర్పడింది ... కసిగా నవ్వుకున్నాడు.

చంద్రశేఖరం తప్పకుండా వస్తాడని, లేదా కనీసం మురిసిపోతూ వుత్తరం రాస్తాడని యెంతో ఆసక్తితో యెదురు చూసిన ఇందిరకు అతను రాసిన వుత్తరం, యెంతో బాధ కలిగించింది. అభిమానం దెబ్బతిని, కుమిలిపోయింది. తప్పంతా తనదేనన్న నిర్ణయానికి వచ్చి, చేసేదిలేక, ఒక వేడి నిట్టూర్పు విడిచి, వుత్తరాన్ని కోపంగా, కసిగా ముక్కముక్కలు చేసి, కిటికీలోంచి బైటికి విసిరేసింది. ఆ ముక్కలు చెల్లాచెదురుగా గాలిలోకి యెగిరి, చెరో దిక్కు పడ్డాయి. అవి యెప్పటికీ అతకబడవు.